క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏవో కె.శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. తెనాలి మేరా యువ భారత్, సాయి మంగ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కె.రమేష్‌కుమార్, అధ్యాపకులు గేరా రాజు, తన్నీరు శివశంకర్, బి.దమోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

జాషువా రచనలు స్ఫూర్తిదాయకం



తెనాలిఅర్బన్: గుర్రం జాషువా రచనలు స్ఫూర్తిదాయకమని జైభీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు కొెవరపు దేవానంద్ కొనియాడారు. గుర్రం జాషువా వర్ధంతిని గంగానమ్మపేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ గబ్బిలం, ఫిరదోసి, క్రీస్తు చరిత్ర వంటి రచనలతో ఆయన విశేష ఆదరణ పొందారని గుర్తు చేశారు. క్రీస్తు చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కూడా లభించిందన్నారు. ఆయన రచనలు సమాజంలో మార్పులు తెచ్చాయని కొనియాడారు. కార్యక్రమంలో జిలుగు పీటర్‌పాల్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

తెనాలిలో వర్షం



తెనాలిఅర్బన్: అల్పపీడనం ప్రభావం వలన తెనాలి పట్టణంలో గురువారం ఉదయం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తూ ఉంది. మధ్యమధ్యలో భారీ వర్షం కురుస్తూ వచ్చింది. దీంతో పట్టణంలోని ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మోటార్ల దొంగ అరెస్ట్



తెనాలిరూరల్: మోటార్లు, పంపుల హ్యాండిళ్లను చోరీ చేస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ కె. ఆనంద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంగం జాగర్లమూడిలోని సంగమేశ్వరస్వామి దేవస్థానం, రైతు భరోసా కేంద్రం, శ్మశాన వాటిక, ఇతర ప్రదేశాల్లోని మోటార్లు, పంపుల హ్యాండిళ్ల కొంత కాలంగా చోరీకి గురవుతున్నాయి. దీనిపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని సంగంజాగర్లమూడి గ్రామానికే చెందిన చిట్టిబోయిన పవన్‌గోపీ అలియాస్ బాబుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి వివరాలు సేకరించి చోరీకి గురైన సొత్తును స్వాధీనపర్చుకున్నారు. కోర్టులో గురువారం హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా గోళ్ళ దేవరాజు



తెనాలిటౌన్: భారతీయ జనతా పార్టీ తెనాలి మండల–2 అధ్యక్షునిగా గోళ్ళ దేవరాజు నియమితులయ్యారు. గురువారం స్థానిక నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో గోళ్ళ దేవరాజును బీజేపీ తెనాలి రెండోవ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి పాల్గొని దేవరాజుకు నియామకపత్రం అందజేసి అభినందించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కె.వాసుదేవనాయుడు, రామకృష్ణ, టి. అనంతాచార్యులు, అడపా సంపత్‌రాయుడు, ఎస్.రవీంధర్, టి.రఘు, అడుసుమల్లి సుధాకర్, కడియాల అనిల్, పసుపులేటి నారాయణ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి పాలన ఇంకెన్నాళ్లు?

- రెండు నెలలు కావస్తున్నా జరగని కమిషనర్ నియామకం
- జూనియర్లకు అందలం
- అభివృద్ధి పనులకు కలగని మోక్షం
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు



తెనాలి మున్సిపల్ కార్యాలయం

తెనాలిఅర్బన్: జిల్లాలో ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ ఇన్‌చార్జిల పాలనలో ఉంది. రెండు నెలల క్రితం జరిగిన సాధారణ బదిలీలలో సీనియర్ కమిషనర్‌ను నియమించినా ఆయన విధుల్లో చేరకపోవటంతో అప్పటి నుంచి అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అప్పటి నుంచి వివిధ పోస్టుల్లో జూనియర్‌లకు పెద్దపీట వేస్తున్నారనే స్థానిక అధికారిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే పూర్తి అయిన అభివృద్ధి పనుల బిల్లులకు ఆయన (వేలిముద్ర) అమోదం తెలపటం లేదనే విమర్శ వినిపిస్తోంది. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది.

గుంటూరు జిల్లాలో ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా తెనాలికి పేరుంది. పట్టణంలో సుమారు 2 లక్షల జనాభా నివశిస్తున్నారు. ఏడాదికి వివిధ రకాల పన్నుల ద్వారా రూ.23.7 కోట్ల ఆదాయం సమకూరుతూ ఉంటుంది. ఇవి కాకుండా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్‌ల ద్వారా రూ.95 కోట్లు తెనాలికి వస్తుంటాయి.

కమిషనర్ నియామకం ఎప్పుడో?

తెనాలి పురపాలక సంఘ కమిషనర్‌గా బండి శేషన్న పనిచేస్తు రెండు నెలల క్రితం జరిగిన సాధారణ బదిలీలలో నంద్యాల మున్సిపాలిటీకి వెళ్లారు. గుంటూరు కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న చల్లా ఓబులేసును తెనాలికి బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే శేషన్న రిలీవ్ అయ్యారు. రెండు రోజుల్లో ఓబులేసు విధులలో చేరుతారనే ప్రచారం జరుగుతుండగా ఓబులేసును గుంటూరులోనే కొనసాగించాలని కోరుతూ కమిషనర్ పులి శ్రీనివాస్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో ఆయన బదిలీ నిలచిపోయినట్లు అయ్యింది. దీంతో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న వీఎం లక్ష్మీపతిరాకు ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) ఇస్తు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. అప్పటి నుంచి ఆయనే ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగుతున్నారు. ఆయన ఆగస్టు నెలఖారుకు పదవీ విరమణ చేయనున్నారు.

బిల్లులకు మోక్షం ఎప్పుడో?

తెనాలి పట్టణంలో అభివృద్ధి కుంటుపడింది. మున్సిపాలిటీలో కావాల్సినన్ని నిధులు ఉన్న ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పడిన నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్టర్‌లు పనులు చేసేందుకు ముందుకు రావటం లేదు. సుమారు ఏడాది క్రితం పూర్తి అయిన పనులకు సంబంధించిన బిల్లులు నేటికీ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన యాప్‌లో అప్‌లోడ్ కావటం లేదంటే అధికారుల పనితీరు ఎలా ఉందో మనకు అర్థమౌతుంది. ప్రస్తుతం తెనాలిలోని ఇన్‌చార్జి కమిషనర్ అభివృద్ధికి సంబంధించిన బిల్లులకు ఆమోదం తెలిపేదిలేదంటూ భీష్మించారు. దీంతో కాంట్రాక్టర్‌లు తాము పనులు చేయలేమంటూ చేతులు ఎత్తేస్తున్నారు. దీంతో తెనాలిలో అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడుతుందని చెప్పవచ్చు. ఇప్పటికైన పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి తెనాలికి నూతన కమిషనర్‌ను నియమించటంతో పాటు జరిగిన పొరపాట్లను సరిచేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. దీనిపై గుంటూరు రీజనల్ డైరెక్టర్ హరికృష్ణను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

నిబంధనలకు విరుద్ధంగా విధుల కేటాయింపులు

తెనాలి రెవెన్యూ విభాగంలో ముగ్గురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో సీనియర్ అసిస్టెంట్‌లను నియమించాల్సి ఉంది. కానీ స్థానిక అధికారులు ఇద్దరిని గతంలో నియమించారు. వారిలో ఒకరు సీనియర్ అసిస్టెంట్ కాగా మరొకరు జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ అనారోగ్య కారణంతో తాను ఆర్ఐగా పనిచేయలేనని చెప్పటంతో కొన్ని నెలలుగా ఒక్కరే పనిచేస్తున్నారు. ఆయన ఇతర ప్రాంతం నుంచి బదిలీపై రావటం.. ఆర్ఐ పోస్టును నూతనంగా తీసుకోవటం వల్ల అనేక ఇబ్బందులు ఏర్పాడ్డాయి. ఈ విషయం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి వెళ్లటంతో ఆయన సూచనతో జూనియర్ అసిస్టెంట్‌తో పాటు మరో సీనియర్ అసిస్టెంట్ పేరును ఆర్ఐ పోస్టుకు రెవెన్యూ ఆఫీసర్ ప్రతిపాదిస్తు ఫైల్‌ను ఇన్‌చార్జి కమిషనర్‌కు పంపారు. కానీ కమిషనర్ జూనియర్ ఒక్కరినే ఆర్ఐగా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంత పెద్ద పట్టణంలో ఒక్కరితో ఎలా పనిచేయగలమనే ఆందోళన నెలకొంది. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో కూడా సీనియర్ డీఈకి కేవలం 7 వార్డులే కేటాయించి, నూతనంగా వచ్చిన ఇద్దరు డీఈలకు మిగిలిన 33 వార్డులు కేటాయించటం వివాదాస్పదమైంది.

గెలిపించిన ప్రజలనే ఓడించిన నేత చంద్రబాబు

- అయన్ను చూస్తేనే మోసం, దగా గుర్తుకొస్తాయి
- ఎన్ని అబద్ధాలు ఆడైనా అధికారంలోకి రావాలనేది బాబు నైజం
- మేనిఫెస్టోపై సంతకం పెట్టిన పవన్‌కూ మోసంలో భాగముంది
- ఇచ్చిన మాటను ఎలాగైనా నెరవేర్చాలనేది జగన్ సిద్ధాంతం
- ఇస్తానన్న సంక్షేమాన్ని ప్రజలకు ఇప్పించే దాకా పోరాడాలి
- లేకుంటే ప్రజాప్రతినిదులు గ్రామాల్లోని రాలేని పరిస్థితులు నెలకొనాలి
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సమావేశంలో మోదుగుల వేణుగోపాలరెడ్డి



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ అక్షరాలను ప్రదర్శిస్తున్న మోదుగుల, శివకుమార్, పార్టీ నేతలు

కొల్లిపర (తెనాలి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విశ్వసించి గెలిపించిన ప్రజలను అధికారంలోకి వచ్చాక ఓడించిన ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. అంబేడ్కర్‌ను చూస్తే రాజ్యాంగం, పొట్టి శ్రీరాములుతో ప్రత్యేకాంధ్ర, ఎన్టీఆర్‌తో రూ.2 కిలో బియ్యం, డాక్టర్ వైఎస్‌ను చూస్తే ఆరోగ్యశ్రీ జ్ఞాపకానికి వస్తాయని చెబుతూ, చంద్రబాబును చూస్తే మోసం, దగా గుర్తుకొస్తాయని చెప్పారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై కొల్లిపర మండలంలోని పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకుల సమావేశాన్ని గురువారం సాయంత్రం అక్కడి పాలకేంద్రం కల్యాణమండపంలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి అధ్యక్షత వహించారు.

వేణుగోపాలరెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ఇచ్చిన మాటను ఎన్ని కష్టాలొచ్చినా అమలు చేయాలనేది జగన్‌మోహన్ రెడ్డి సిద్ధాంతమని, అందుకే ఎవరెన్ని చెప్పినా, ఎన్నికల్లో అబద్ధపు వాగ్దానాలు చేయలేదని గుర్తుచేశారు. ఎన్ని అబద్ధాలు ఆడైనా ఎన్నికల్లో గెలవాలనేది చంద్రబాబు ధోరణిగా చెప్పారు. ఆయన ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి ఇంటికీ రావాల్సిన సంక్షేమాన్ని గడపగడపకు కార్యకర్తలు తీసుకెళ్లాలనీ, ప్రజలకు ఇవ్వాల్సిన డబ్బులను వడ్డీతో సహా కట్టించాల్సిందేనని వేణుగోపాలరెడ్డి స్పష్టం చేశారు. అలా ఇవ్వనినాడు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామాల్లోకి రాలేని పరిస్థితి నెలకొనాలని చెప్పారు. హామీలు నెరవేర్చకుండా ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలను జైలుకు పంపిస్తున్నారని చెబుతూ, అయినా ఎవరూ ఖాతరు చేయడం లేద న్నారు. మళ్లీ మనమే అధికారంలోకి వస్తామన్న భావన పార్టీ నాయకులు, కార్యకర్తలో ఉందన్నారు. చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టోలో సంతకం చేసిన పవన్ కళ్యాణ్‌కూ ఈ మోసంలో భాగం ఉందన్నారు. 'వీరమల్లు... వీరమల్లు...అదికూడా తుస్సుమందని, వీళ్లు సినిమాల్లోనే హీరోలు, బయట జీరోలు' అని వ్యాఖ్యానించారు. ఏపీ ప్రజలను జాగ్రత్తగా చూసుకోవాలని ఆశీర్వదించిన చిరంజీవి దంపతులు కూడా అవినీతి, అబద్ధాలకోరు అయిన చంద్రబాబును నమ్మొద్దని పవన్ కల్యాణ్‌కు చెప్పాలన్నారు.

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ నాయకులు సంక్షేమం ఇవ్వకుండా, అభివృద్ధి చేయకపోవటంపై పార్టీ కార్యకర్తలు ప్రజల తరఫున ప్రశ్నించాలని సూచించారు. జగన్ మోహన్‌రెడ్డి కన్నా ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తామని అధికారంలోకి వచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్, 'బటన్ నొక్కుతామని చెప్పి ప్రజలు మాకు ఓటేయలేదు' అనటం, మరో మంత్రి అచ్చెన్నాయుడు, 'ఆడపిల్లలకు నెలకు రూ.1500 చొప్పున ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్మేయాల్సి వస్తుంది' అనటాన్ని నిలదీయాలన్నారు. యాభై ఏళ్లకు పింఛను హామీ సంగతటుంచితే 60 ఏళ్లు నిండిన వేలాది అర్హులకు కొత్తగా ఒక పింఛను కూడా ఇవ్వలేదన్నారు. సంక్షేమంతోపాటు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, నాడు–నేడుతో పాఠశాల భవనాలను నిర్మించినట్టు గుర్తుచేశారు.

సంక్షేమం అందించలేని కూటమి ప్రభుత్వం కనీసం అభివృద్ధి పనుల సైతం చేపట్టటం లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన ఆర్థిక లాభం, కూటమి ప్రభుత్వ హామీలు అమలు చేయనందున జరిగిన ఆర్థికనష్టంపై ప్రతి ఇంటికీ వివరించాలని సూచించారు. కొల్లిపర ఎంపీపీ అవుతు పద్మావతి సంజీవరెడ్డి, గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, లిడ్క్యాప్ మాజీ డైరెక్టర్ వేల్పుల రవికుమార్, గుదిబండి కృష్ణకిషోర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సుజాత, అవుతు కృష్ణారెడ్డి, జొన్నల శివారెడ్డి, బొల్లిముంత పోతురాజు, భీమవరపు శివకోటిరెడ్డి, ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, ఈదా యశ్వంత్‌రెడ్డి, కేశన శ్రీలత, చిలుమూరి ఝాన్సీ, కళ్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, మాట్రా రాజు, అవుతు పోతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బుక్స్, మొక్కలు పంపిణీ



మొక్కలు, పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఉమామహేశ్వర్

తెనాలిఅర్బన్: విద్యార్థులు విద్యలో రాణించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. విశ్రాంత వ్యవసాయ విస్తరణాధికారి వేజళ్ళ వెంకట సుబ్బారావు 11వ వర్ధంతిని పురస్కరించుకుని బీసీ కాలనీలోని వేజళ్ళ వెంకట సుబ్బారావు స్పెషల్ పురపాలక పాఠశాలలోని విద్యార్థులకు వ్రాత, డ్రాయింగ్ పుస్తకాలు, కలర్ క్రేయన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బారావు స్మారక విద్యట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలను 2017లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు, గుడ్డ సంచులు, మొక్కలు, దుస్తులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఓంకారప్రసాద్, ప్రధానోపాధ్యాయులు నాగమణి, ఉపాధ్యాయులు పద్మజ, నాగేంద్రబాబు, మమత, ట్రస్ట్ సభ్యులు శ్రీదేవి, బి.శివరామకృష్ణ, వేజళ్ళ ఝాన్సీలక్ష్మీ, బి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

దుగ్గిరాల: పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సుస్థిర అభివృద్ధి సాధించవచ్చునని రైతు సాధికారిక సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు సీహెచ్ రాజకుమారి అన్నారు. దుగ్గిరాలలో గురువారం మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని దుగ్గిరాల, కొల్లిపర, తెనాలి మండలాల పరిధిలోని రైతుసేవా కేంద్రాలలో పని చేస్తున్న సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మొదటి రోజు పాల్గొన్న రాజకుమారి మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలిగించే రసాయనికి ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకూడదని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఏవో ఆర్ విజయ్‌బాబు, కె.సుధీర్‌బాబు, శ్రీనివాస్ రెడ్డి, ఏపీ సీఎస్ఎఫ్ సిబ్బంది, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

కథల పుస్తకాలు వితరణ

దుగ్గిరాల: విద్యార్థులు పాఠ్య పుస్తకాలే కాకుండా.. ఇతర ఊహాత్మక కథలు, ప్రముఖుల జీవిత చరిత్రలు చదవడం ద్వారా మేథస్సు పెరుగుతోందని హెచ్.ఎం ఎస్.శోభాదేవి అన్నారు. గురువారం దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలకి బ్రెడ్ సొసైటీ వారు అందించిన 40 రకాల తెలుగు, ఇంగ్లిష్ భాషలకు సంబంధించిన కథల పుస్తకాలను విద్యార్థులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్రెడ్ సొసైటీకి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా చౌడేశ్వరీ అమ్మవారి జన్మదినోత్సవం



తాడేపల్లి రూరల్: దేవాంగ చేనేత కుల దేవత శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరీ అమ్మవారి జన్మదినోత్సవాన్ని గురువారం అమరావతి దేవాంగుల సంక్షేమ సంఘం, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళగిరి కొప్పురావు కాలనీలోని అయిదవ లైన్‌లో గల సంఘ కోశాధికారి అల్లాక నమశివాయ ఇంటి వద్ద నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలోని శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలీయ వెల్ఫేర్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ నందం అబద్దయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, అమరావతి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మంగళగిరి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బల్ల వెంకట రమణ, అల్లక తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేయాలి



పార్టీ మండల కమిటీ కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శివకుమార్

- మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి
- కొల్లిపరలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై సమావేశం

కొల్లిపర: నూతనంగా ఎన్నికైన పార్టీ మండల కమిటీ కార్యవర్గం సభ్యులు పార్టీ అభివృద్ధికి నిబంధతతో పనిచేయాలని, రానున్న రోజుల్లో రాష్ట్ర సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే శివకుమార్‌ను గెలిపించే విధంగా కృషి చేయాలని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలోనే పాలకేంద్రం కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ మండల స్థాయి సమావేశం కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన పార్టీ మండల కార్యవర్గం సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు.

సభలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ కమిటీకి స్థానిక నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి వారితో సహకరించాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి మాట్లాడుతూ పార్టీ వారిపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శాయశక్తులా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని, రానున్న ఎన్నికల్లో సీఎంగా వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిని, స్థానిక శాసనసభ్యులుగా శివకుమార్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేస్తారని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పార్టీ మండల కార్యవర్గ సభ్యులను ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, వివిధ గ్రామాల పార్టీ ప్రధాన నాయకులు, కార్యకర్తలు ముఖ్యఅతిథులతో కలిసి శాలువాలలతో, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పార్టీ నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను భారం కాదు బాధ్యత

ఆదాయ పన్ను అధికారి జేజీఎస్ కిషోర్‌కుమార్



కిషోర్‌కుమార్‌ను సత్కరించిన మురళీకాంత్

తెనాలి: ఆదాయ పన్ను చెల్లించడం పన్ను చెల్లింపుదారులు భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని, సకాలంలో చెల్లిస్తూ దేశప్రగతిలో భాగస్వాములు కావాలని ఆదాయ పన్నుశాఖ, తెనాలి అధికారి జేజీఎస్ కిషోర్‌కుమార్ సూచించారు. జాతీయ ఆదాయ పన్ను దినోత్సవం సందర్భంగా స్థానిక నెహ్రూనికేతన్ జూనియర్ కాలేజీలో గురువారం ఏర్పాటైన అవగాహన సదస్సుకు కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి అధ్యక్షత వహించారు. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో తొలిసారి ఆదాయ పన్ను విధించిన జులై 24న ఏటా ఆదాయపన్ను దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బ్రిటీష్ ప్రభుత్వం 1860 జులై 24న ఆదాయ పన్ను చట్టం తీసకొచ్చిందని, అనేక సవరణల అనంతరం భారత ప్రభుత్వం 1961లో చేసిన చట్టమే అమలులో ఉందన్నారు. ఆదాయ పన్నుతో పాటు ప్రజలు వివిధ పన్నుల రూపంలో ప్రజలు చెల్లించే డబ్బును ప్రభుత్వం దేశాభివృద్ధికి వినియోగిస్తుందని గుర్తుచేశారు. ఆదాయ పన్ను చెల్లింపునకు సంబంధించిన లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. పవర్‌పాయింట్ ప్రెజంటేషన్‌తో అవగాహన కల్పించారు. కాలేజీ యాజమాన్యం కిషోర్‌కుమార్‌ను సత్కరించింది. ఆదాయ పన్ను కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు టి.శంకరరావు, పి.శ్రీనివాసరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ ఘట్టమనేని సాయి రేవతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పట్టణవాసులకు ఇబ్బంది రానివ్వకండి



సూచనలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు



3వ వార్డులో కాల్వలను పరిశీలిస్తున్న ఆరోగ్యాధికారి యేసుబాబు

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీ.ఎం.లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు సూచించారు. పూలే కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపునీరు రోడ్లపై నిల్వకుండా చూడాలన్నారు. ఖాళీ స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. అనంతరం ఎస్‌టీపీ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, సిబ్బంది ఉన్నారు.

- 3వ వార్డులో మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వలను ప్రతిరోజు బాగు చేయాలన్నారు. కాల్వల్లో వ్యర్థాలు కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.

మహిళలు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థినుల సంఘ ప్రతినిధులతో ఎమ్మెల్సీ ఆలపాటి

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలిఅర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జెఎంజె కళశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆడిటోరియంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో విజ్ఞానం పెంపొందుతుందన్నారు. మహిళలు జ్ఞానంతో ఉంటే కుటుంబం కూడా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో మహిళలు ఇంటికే పరిమితమయ్యేవారని, నేడు అన్ని రంగాల్లో ప్రవేశించడం శుభపరిణామమన్నారు. ప్రిన్సిపల్ సిస్టర్ శాంత మాట్లాడుతూ 1963లో జెఎంజె కళాశాలను స్థాపించి విద్యార్థినుల భవిష్యత్‌కు బాటలు వేయడం జరుగుతుందన్నారు. తమ విద్యాసంస్థల్లో చదివిన అనేక మంది ఉన్నత స్థితిలో ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం నూతన ఎంపి కైన స్టూడెంట్ లీడర్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్‌లీనా, అధ్యాపకులు డాక్టర్ పాటిబండ్ల హేమలత, విద్యార్థినీలు పాల్గొన్నారు.